జనగామలో మహిళలకు సర్టిఫికెట్స్ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

కుట్టు శిక్షణ సర్టిఫికెట్టతో ఓట్లకు గాలం!

జనగామలో పంపిణీ చేసిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. ఓ స్వచ్ఛంద సంస్థ పేరిట ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వైష్ణవి గార్డెన్స్‌లో సోమవారం మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తా : పల్లా

కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కోడ్ ఉల్లంఘనపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. కుట్టు మిషన్ శిక్షణార్థులకు మిషన్లు ఇప్పిస్తామని ప్రకటించారని పేర్కొన్నారు.

ఓటర్లకు కాంగ్రెస్ ప్రలోభాలు

- రెండు గ్రామాల్లో గడియారాల పంపిణీ

నాటవెల్లి పెద్దతండాలో గోడ గడియారాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట, ఏప్రిల్ 29: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ సెగ్మెంట్లలో ఓటమి పాలవుతామని సర్వేలు చెబుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భయం పట్టుకున్నది. దీనిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నాటవెల్లిపెద్ద తండా, భూత్కూర్ గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బొమ్మలతో కూడిన గోడ గడియారాలను పంపిణీ చేశారు. ఈ విషయంపై బీఆర్ఎస్ నేతలు ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు జడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, చెన్నకేశవరెడ్డి తెలిపారు. అమలుకానీ హామీలతో గద్దెనెక్కింది చాలక.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను కోరారు.

మైనింగ్ ఆపకుంటే ఎన్నికలను బహిష్కరిస్తాం

పర్యావరణం, ప్రజాజీవనానికి నష్టం కలిగించే మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని, లేదంటే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం ప్రజలు హెచ్చరించారు. 'గుట్ట ముద్దు-ఓటు వద్దు' అంటూ వాల్‌పోస్టర్లను గ్రామంలో అంటించారు.

–బల్మూరు

జంప్ జిలానీలూ.. ఖబడ్దార్

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్ అయ్యే నాయకులారా ఖబడ్దార్.. అంటూ వరంగల్ నగరంలోని పలు కాలనీల్లో కార్టూన్ ఫ్లెక్సీలు వెలిశాయి. పార్టీ మారే నేతలను హెచ్చరిస్తూ ఫ్లెక్సీలకు చెప్పుల దండలు వేయడం నగరంలో సంచలనంగా మారింది. –హనుమకొండ చౌరస్తా

కాంగ్రెస్, బీజేపీ రిమోట్ బాబు చేతిలో!

- ఓ టీవీ చానెల్‌తో వైఎస్ జగన్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను నడిపిస్తున్నది తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఏపీలో కాంగ్రెస్, బీజేపీ రిమోట్‌లు చంద్రబాబు వద్దనే ఉన్నాయని ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. కడప లోక్‌సభ స్థానంలో తన చెల్లెలు పోటీ చేయడంపై తనకు ఎటువంటి బాధ లేదని అన్నారు. అయితే ఆమె డిపాజిట్ కూడా దక్కించుకోదేమోనన్న బాధ ఎక్కువగా ఉందని చెప్పారు. తనపై నమోదైన అక్రమ ఆస్తుల కేసులో తన తండ్రి పేరును చేర్చిన కాంగ్రెస్ పార్టీ పక్షాన షర్మిల పనిచేయడం తనకు ఆవేదనగా ఉందని అన్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబుతోనే కాకుండా జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలతో కూడా తాను పోరాటం చేస్తున్నానని పేర్కొన్నారు.

మద్యాన్ని నియంత్రించాలి: ఈసీకి హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా నిర్వహించే బదిలీల్లో ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఇస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. రెవెన్యూ, హోం శాఖల అధికారుల మాదిరిగానే ఎక్సైజ్ అధికారుల బదిలీ కోసం ఈసీకి ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిల్‌ను డిస్మిస్ చేసింది. ఎన్నికల సమయంలో మద్యాన్ని నియంత్రించేందుకు ఈసీ చర్యలు చేపట్టాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

రేవంత్‌కు ఢిల్లీ పోలీసుల నోటీస్

- అమిత్‌షాపై ఫేక్ వీడియోను షేర్ చేసినందుకు నోటీసులు
- మే 1న ఢిల్లీలో విచారణకు హాజరుకావాలని ఆదేశం
- రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియాలో నలుగురికి సమన్లు
- గాంధీభవన్ వచ్చి సమన్లు అందజేసిన ఢిల్లీ స్పెషల్ సెల్

ఫేక్ వీడియోపై సోమవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు రామచంద్రా రెడ్డి, శోభారాణికి నోటీసులు అందజేస్తున్న ఢిల్లీ పోలీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): బీజేపీ అధికారంలోకి వస్తే మొత్తం రిజర్వేషన్లను ఎత్తివేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నట్టు వైరల్ అయిన ఓ ఫేక్ వీడియోకు సంబంధించి ఢిల్లీ పోలీసులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. మే నెల ఒకటో తేదీన జరుగనున్న విచారణకు తమ ముందు హాజరుకావాలని ఆదేశించారు. ఆ వీడియోను షేర్ చేసిన రేవంత్‌తోపాటు తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన మరో నలుగురికి ఈ నోటీసులు అందాయి. విచారణకు వచ్చేటప్పుడు తమ మొబైల్ ఫోన్లను తీసుకొని రావాలని ఢిల్లీ పోలీసులు ఆదేశించారు. కేంద్ర హోం శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్‌క్రైం కోఆర్డినేషన్ సెంటర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ దర్యాప్తును ప్రారంభించింది. తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియాకు చెందిన మన్నె సతీశ్, శివకుమార్, తస్లీమ్ నోటీసులు అందుకున్నవారిలో ఉన్నారు. అయితే వీళ్లు అందుబాటులో లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో లీగల్ సెల్ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి ఆ నోటీసులను స్వీకరించారు.

ఫేక్ వీడియో ఆధారంగా రేవంత్ పీసీ

రేవంత్‌రెడ్డి ఈ ఫేక్ వీడియో ఆధారంగా ఏకంగా ప్రెస్‌మీట్ కూడా పెట్టి అమిత్‌షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎంగా, పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న రేవంత్‌రెడ్డి, ఆయన బృందంలోని సభ్యులు దేశ హోంశాఖ మంత్రికి సంబంధించిన ఫేక్ వీడియోలను వ్యాప్తిచేయడం, రాజకీయ దురుద్దేశాన్ని ఆపాదించేందుకు ప్రయత్నించడం తీవ్రమైన నేరమని ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. దీనిపై కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో ఉన్న రేవంత్‌రెడ్డి స్పందించారు. బీజేపీ ఇప్పటివరకు సీబీఐ, ఈడీలను ఉపయోగించిందని, ఇప్పుడు ఢిల్లీ పోలీసులను వాడుతున్నదని అన్నారు.

నోటీసులు తీసుకున్నాం: కాంగ్రెస్ లీగల్ సెల్ ఇన్‌చార్జి

ఢిల్లీ పోలీసులు సోమవారం గాంధీభవన్‌కు వచ్చారని, ఇన్‌స్పెక్టర్ నీరజ్ చౌదరి వచ్చి నోటీసులు అందజేశారని కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి చెప్పారు. మే ఒకటో తేదీన విచారణకు రావాలని అడిగారని, తాము 15 రోజులు గడువు అడిగామని చెప్పారు.

అసలేంటి ఈ కేసు?

అమిత్‌షా ఇటీవల రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ తెలంగాణలో ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, తాము కేంద్రంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటుచేసిన తర్వాత వాటిని రద్దు చేస్తామని అన్నారు. ఈ వీడియోను మార్ఫింగ్ చేసి.. అమిత్‌షా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేస్తామని అన్నట్టుగా మార్చివేశారు. ఈ వీడియోను తెలంగాణ కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేసిందని, ఆ తర్వాత పలువురు కాంగ్రెస్ నేతలు రీపోస్టు చేస్తూ దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

సోషల్ మీడియా సంస్థలకు ఢిల్లీ పోలీసుల లేఖ!

ఢిల్లీ పోలీసులు ఈ వీడియో షేరింగ్ ఎక్కడి నుంచి ప్రారంభమైందనే దానికి సంబంధించి 'మూలాలు' తెలుసుకొనేందుకు ఎక్స్‌తో పాటు ఇతర సోషల్ మీడియా సంస్థలకు లేఖ రాసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. వీడియోను ఎవరు వ్యాప్తి చేశారు? మూలం ఎక్కడి నుంచి వచ్చిందనే విషయాన్ని తెలుసుకొనేందుకు సమాచారం అందజేయాలని కోరింది.

ఈసీకి బీజేపీ ఫిర్యాదు

అమిత్‌షా వీడియో వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసింది. ఫేక్ వీడియోను కాంగ్రెస్ సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నదని, ఆ పార్టీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, బీజేపీ మీడియా సెల్ ఇన్‌చార్జి అనిల్ బలూని ఈసీకి ఫిర్యాదు చేశారు. మరోవైపు రాజస్థాన్ బీజేపీ విభాగం సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

అస్సాంలో కాంగ్రెస్ నేత అరెస్టు

అమిత్‌షా 'ఫేక్ వీడియో'ను షేర్ చేసిన గువాహటికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్టు అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వెల్లడించారు. అరెస్టయిన 31 ఏండ్ల రీతోం సింగ్‌కు రాష్ట్ర కాంగ్రెస్‌తో సంబంధం ఉన్నదని, ఆయన పార్టీ 'వార్ రూమ్ కోఆర్డినేటర్'గా పనిచేస్తున్నారని తన ఎక్స్‌లో ఖాతాలో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో అమిత్‌షాపై ఫేక్ వీడియో ప్రచారానికి సంబంధించి ఫిర్యాదు మేరకు పాన్‌బజార్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందని అస్సాం పోలీసు ఉన్నతాధికారి ప్రణబ్‌జ్యోతి గోస్వామి పేర్కొన్నారు. రీతోం సింగ్ నుంచి పోలీసులు రెండు మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకొన్నారు.

అమిత్ షా ఫేక్ వీడియో.. రేవంత్ రెడ్డి కుట్ర

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నట్టుగా సృష్టించిన ఫేక్ వీడియోలు కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి చేసిన కుట్రను ప్రజలు నమ్మడం లేదని అన్నారు. పలువురు నాయకులు బీజేపీలో చేరిన సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రిజర్వేషన్లు తీసేస్తారని, హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటిస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీపై, ఆర్ఎస్ఎస్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు నిరాధారమన్నారు. ఆయనకు నైతికత ఉంటే వెంటనే వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి తన ప్రసంగాల ద్వారా, కాంగ్రెస్ అధికారిక సోషల్ మీడియా ద్వారా అబద్ధాలు ప్రచారం చేస్తూ కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి తీవ్రవాదిలాగా దేశద్రోహానికి పాల్పడుతున్నారని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి బుడ్డర్ ఖాన్ తరహాలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గుత్తా అమిత్‌రెడ్డి, పక్కన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

కాంగ్రెస్‌లోకి గుత్తా అమిత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు, బీఆర్ఎస్ నేత గుత్తా అమిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం ఆయన తన బాబాయి, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డితోపాటు మరికొందరితో కలసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అంతకు ముందు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలిసి జూబ్లీహిల్స్‌లోని అమిత్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. కాంగ్రెస్‌లో చేరితే సముచిత స్థానం కల్పిస్తామని అమిత్‌రెడ్డికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వాస్తవానికి అమిత్‌రెడ్డి ఇటీవల బీఆర్ఎస్ నుంచి ఎంపీ టికెట్ ఆశించారు. అదే సమయంలో కాంగ్రెస్ టికెట్ కోసం మంత్రి కోమటిరెడ్డితోపాటు వేం నరేందర్‌రెడ్డిని కలువడం చర్చనీయాంశంగా మారింది. చివరకు కాంగ్రెస్ టికెట్ రాకపోయినా ఆయన ఆ పార్టీలో చేరడం గమనార్హం.

గాంధీభవన్ కేంద్రంగా కాంగ్రెస్ దుష్ప్రచారం

- రాజకీయ ప్రత్యర్థులపై బురదజల్లే ప్రయత్నం
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి అదే పని

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): గాంధీభవన్ కేంద్రంగా కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం దుష్ప్రచారం చేస్తున్నది. దీని ఫలితంగానే ఢిల్లీ పోలీసుల నుంచి సోమవారం తాఖీదులు అందుకోక తప్పలేదు. రాజకీయ ప్రత్యర్థులను ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక, తప్పుడు ప్రచారం, బురద జల్లడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకొన్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇలాగే బదనాం చేసిన విషయం తెలిసిందే. రాజకీయ పార్టీలు, ప్రత్యర్థుల వ్యాఖ్యలను మార్ఫింగ్ చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నది. కర్ణాటకలో కాంగ్రెస్‌కు అధికారం సోషల్ మీడియా వల్లే సాధ్యపడిందన్న విమర్శలు ఉన్నాయి. సొంత పార్టీలో, అధిష్ఠానంలో తనను రాజకీయంగా దెబ్బతీయడానికి పార్టీ సోషల్ మీడియానే పథకం ప్రకారం కుట్ర చేస్తున్నట్టు అసెంబ్లీ ఎన్నికలకు ముందు పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కాంగ్రెస్ వార్‌రూమ్‌పై అప్పట్లో పోలీసులు దాడిచేసి కంప్యూటర్ల హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకొన్నారు. తర్వాత కాంగ్రెస్ సోషల్ మీడియా కొంతకాలం పాటు కర్ణాటక కేంద్రంగా తన కార్యకలాపాలను నిర్వహించింది. తమ రాజకీయ ప్రత్యర్థులు, నాయకులపై బురద జల్లడం, వారి వ్యాఖ్యలు, మాటలను ఎడిటింగ్, మార్ఫింగ్ చేయటం ద్వారా ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు, సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం, మంత్రులపై, ఆరు గ్యారెంటీలు అమలు కావటం లేదని సోషల్‌మీడియాలో పోస్టుచేసిన వారిపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపారు. తనపై, పార్టీపై, కేసీఆర్‌పై కొన్ని యూట్యూబ్ చానల్స్ సాగిస్తున్న దుష్ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. అయితే, సోషల్ మీడియాలో వైరల్ చేసిన ఆ కథనాలు కాంగ్రెస్ సోషల్ మీడియా వండి వార్చినవేనని బయటపడింది.

లోకం పోకడ



ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	45.5°c	32.7°c
మహబూబ్‌నగర్	44.7°c	30.2°c
ఆదిలాబాద్	44.5°c	26.8°c
రంగారెడ్డి	43.6°c	22.1°c
నిజామాబాద్	43.4°c	29.7°c
ఖమ్మం	43.0°c	28.0°c
మెదక్	42.9°c	24.0°c
కరీంనగర్	42.0°c	29.0°c
వరంగల్	42.0°c	27.0°c
హైదరాబాద్	41.6°c	29.3°c

కొలిమి పక్కన కూర్చున్నట్టే!

రాష్ట్రంపై నిప్పులు కక్కుతున్న భానుడు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. భానుడు నిప్పులు కక్కుతున్నడా అనిపిస్తున్నది. మండే ఎండలకు తోడు ఉక్కపోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కన్నా దాదాపు ఐదు డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొద్ది రోజులుగా ప్రమాద హెచ్చరిక స్థాయి 45 డిగ్రీల మార్కును దాటి ఎండలు మండుతున్నాయి. సోమవారం ఏడు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 45.4 డిగ్రీలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఈ జిల్లాలోని మాటూరు, తిమ్మాపురంలో 45.1 డిగ్రీలు, నిడమనూరు, కామారెడ్డిగూడెంలో 44.8, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో 45.3 , ములుగు జిల్లా మంగపేటలో 45.3, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం రాగొంలో 45.2, ఖమ్మం జిల్లా చింతకానిలో 45.1, వనపర్తి జిల్లా పాన్గల్‌లో 45.1, జగిత్యాల జిల్లా వెల్గటూరులో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. మహబూబాబాద్, నిజామాబాద్ సహా పలు జిల్లాల్లో 44.9 డిగ్రీల ఎండ తీవ్రత కొనసాగింది. ఖమ్మం, ములుగు జిల్లాల్లో వడగాలులు వీచినట్టు అధికారులు తెలిపారు. మంగళవారం కూడా ఉష్ణోగ్రతల తీవ్రత కొనసాగుతుందని హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది.

7 జిల్లాల్లో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు తెలంగాణలో నమోదవుతున్నాయి. సోమవారం ఏడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలు, మరో 26 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిరుడు ఏప్రిల్‌తో పోలిస్తే 4.5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. గత ఏప్రిల్ 29న రాష్ట్ర సగటు అత్యధిక ఉష్ణోగ్రత 40.9 డిగ్రీలుగా రికార్డయింది. నిరుడు 11 జిల్లాల్లో 35 డిగ్రీలలోపు, 22 జిల్లాల్లో 35 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరికొంత పెరిగే అవకాశం ఉంటుందని, వృద్ధులు, పిల్లలు, వీధి వ్యాపారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

తుస్సుమన్న 'నడ్డా' సభ

- జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు
- ఫొటోలు తీస్తున్న విలేకరుల కెమెరాలు లాక్కున్న కార్యకర్తలు

భద్రాద్రి కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జేపీ నడ్డా సభలో జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెంలో సోమవారం బీజేపీ నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సభ తుస్సుమంది. ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తొలిసారి వచ్చినప్పటికీ ప్రజలెవరూ రాలేదు. సభా ప్రాంగణమంతా ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. ఖాళీ కుర్చీలను ఫొటోలు తీస్తున్న విలేకరుల కెమెరాలను కార్యకర్తలు లాక్కున్నారు. దీంతో సభలో విలేకరులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. పార్టీ నేతలు తాగునీరు ఏర్పాటుచేయకపోవడంతో ప్రజలు దాహంతో అల్లాడిపోయారు. కాగా సభలో జేపీ నడ్డా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే కుంభకోణాల పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో నాయకులంతా ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో ఒక్క ఎంపీ సీటు కూడా గెలవలేరని చెప్పారు. రాష్ట్రంలో 17 సీట్లు బీజేపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడ బీజేపీ నేతలు బండారు లక్షణ్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రంగాకిరణ్, ఖమ్మం, మహబూబాబాద్ అభ్యర్థులు వినోద్‌రావు, సీతారాంనాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రధాని ఎవరు?

మహబూబాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రధాని అభ్యర్థే లేరని, కాంగ్రెస్ నాయకులు సోనియా, రాహుల్‌గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో పాటు అందరూ అవినీతిపరులేనని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. సోమవారం మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల సభలో నడ్డా మాట్లాడారు. గిరిజన మ్యూజియం హైదరాబాద్‌లో, ఆదివాసీ, గిరిజనుల కోసం సమ్మక్క, సారలమ్మ పేర్ల మీద గిరిజన యూనివర్సిటీ, హైదరాబాద్ నుంచి భద్రాచలం వరకు జాతీయ రహదారి ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అవినీతి రహిత పాలన కోసం బీజేపీని గెలిపించాలని కోరారు. ఇక్కడ డాక్టర్ లక్ష్మణ్, గరికపాటి మోహన్‌రావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ధర్మారావు, బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ పాల్గొన్నారు.

చిరుత చిక్కేనా? బోనులో చేరేనా?

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోకి దూరిన చిరుత
- రెండురోజులైన